ప్రజావాణిలో 10 ఫిర్యాదులు



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్‌ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఫిర్యాదుదారులు తమ సమస్యలను అధికారులకు ఫిర్యాదు చేశారు. అడ్మినిస్ట్రేషన్‌ 1, ఇంజినీరింగ్‌ 5, టౌన్‌ ప్లానింగ్‌ 3, డీడీ పార్కుకు సంబంధించి 1, మొత్తం 10 ఫిర్యాదులను అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ త్వరితగతిన సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

సత్కారం



సత్కరించిన పులిగొళ్ల శ్రీనివాస్‌ యాదవ్‌

మోతీనగర్‌: వివేకానందనగర్‌ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీగణపతి నవరాత్రి ఉత్సవాలకు సహకరించిన కమిటీ సభ్యులకు, దాతలకు వివేకానందనగర్‌ సేవా సమితి కమిటీ చైర్మన్‌ పులిగొళ్ల శ్రీనివాస్‌ యాదవ్‌, ప్రెసిడెంట్‌ గంగుమళ్ల వరప్రసాద్‌, వైస్‌ చైర్మన్‌ కాయతి యాదవరెడ్డి, ప్రధాన కార్యదర్శి కలవల ఏడుకొండలు సోమవారం సత్కరించారు. ముఖ్య అతిథులుగా శ్రీవివేకానందనగర్‌ కాలనీ అధ్యక్షుడు బొల్లు శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తున్న ప్రభుత్వం



ఎల్‌ఓసీ పత్రాలను అందజేస్తున్న గోపిశెట్టి రాఘవేందర్‌ తదితరులు

మోతీనగర్‌: ప్రజల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం పని చేస్తోందని కాంగ్రెస్‌ పార్టీ సీనియర్‌ నాయకుడు, బీ బ్లాక్‌ మాజీ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్‌ పేర్కొన్నారు. మోతీనగర్‌ ప్రాంతవాసులైన గణేష్‌, వంశీ, భవ్యశ్రీ అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా వారికి మంజూరైన ఎల్‌వోసీ పత్రాలను మూసాపేట డివిజన్‌ అవంతినగర్‌ కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కులను ఆయన అందజేశారు. కేపీఎంసీ డైరెక్టర్‌ సుధాకర్‌, టీవీఎస్‌టీ టెంపుల్‌ కమిటీ సభ్యులు నర్సింలు, స్థానిక నాయకులు ఆనంద్‌రెడ్డి, సాత్విక్‌ ఉన్నారు.

బతుకమ్మ కుంట వద్ద ఏర్పాట్లు చేయండి



ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్‌ డివిజన్‌లో బతుకమ్మ పండగను పురస్కరించుకుని బతుకమ్మ కుంట మరమ్మతులను సోమవారం జీహెచ్‌ఎంసీ అధికారి ఏఈ నిఖిల్‌, వెల్ఫేర్‌ అసోసియేషన్‌ సభ్యులు, స్థానికులతో కలిసి కార్పొరేటర్‌ మాధవరం రోజాదేవి రంగారావు పరిశీలించారు. బతుకమ్మ కుంట వద్ద మరమ్మతులతో పాటు శుభ్రత, లైటింగ్‌, నీటి సదుపాయాలను జీహెచ్‌ఎంసీ అధికారులు తక్షణమే పూర్తి చేయాలన్నారు.

వాటర్‌ లైన్‌ పనులపై ఆరా

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్‌ డివిజన్‌ పరిధిలోని నిజాంపేట్‌ మెయిన్‌ రోడ్డు, ఓల్డ్‌ ముంబై హైవే సర్వీస్‌ రోడ్డు వద్ద జరుగుతున్న వాటర్‌ మెయిన్‌ లైన్‌ లీకేజీ సమస్యలను వాటర్‌ వర్క్స్‌ అధికారులతో కలిసి సోమవారం స్థానిక కార్పొరేటర్‌ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మరమ్మతులు నిర్వహించలేకపోయామని, ప్రస్తుతం అత్యవసరంగా లీకేజీల వద్ద మరమ్మతులు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో వాటర్‌ వర్క్స్‌ ఏఈ వివేక్‌, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ గౌస్‌ పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ నార్నే శ్రీనివాసరావు తదితరులు

సమస్యలతో పరేషాన్‌

- నిత్యం అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- ఎన్నిసార్లు విన్నవించినా స్పందన కరువు
- పరిష్కరించడంలో రైల్వే అధికారులు విఫలం

అస్తవ్యస్తంగా బోరబండ ఎంఎంటీఎస్‌ రైల్వే స్టేషన్‌



బోరబండ ఎంఎంటీఎస్‌ రైల్వేస్టేషన్‌లో ధ్వంసమైన ముఖద్వారం



బోరబండ ఎంఎంటీఎస్‌ రైల్వేస్టేషన్‌ ఆవరణలో మురుగు

మోతీనగర్‌: బోరబండ ఎంఎంటీఎస్‌ రైల్వే స్టేషన్‌ పేరు చెబితేనే ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఈ స్టేషన్‌ నుంచి రాకపోకలు సాగించాలంటే బాబోయ్‌.. అంటున్నారు. దాదాపు రెండు దశాబ్దాల క్రితం అల్లాపూర్‌, మూసాపేట డివిజన్లలో బోరబండ, భరత్‌నగర్‌ రైల్వే స్టేషన్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుత్తం ఈ రెండు ఎంఎంటీఎస్‌ రైల్వే స్టేషన్లలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ప్రయాణికులు లోనికి వెళ్లకముందే సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. పరిసరాలు అస్తవ్యస్తంగా మారాయి.

- మూత్రశాలలకు వెళ్లాలంటే ఆందోళన చెందాల్సిన దుస్థితి. వాటిలోకి అడుగు పెట్టలేనంతగా అధ్వానంగా ఉన్నాయి. నిత్యం ఆ ప్రాంతాల్లో ఆకతాయిలు తిష్టవేసి మద్యం, గంజాయి తాగుతుండటంతో ప్రయాణికులకు అసౌకర్యంగా ఉంటోంది. ఎవరైనా ప్రయాణికులు ఇదేమిటని అడిగితే వారిపై దాడి చేసేందుకు సైతం వెనకాడటం లేదు. రాత్రి అయ్యిందంటే దొంగల ఆగడాలు పెరిగిపోతున్నాయి. ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద ఉన్న గాజు తలుపులను కొందరు పోకిరీలు ధ్వంసం చేశారు. ముఖ్యంగా మహిళలు భయాందోళనకు గురవుతున్నారు.
- గతంలో బోరబండ ఎంఎంటీఎస్‌ రైల్వే స్టేషన్‌ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రతి అరగంటకు ఓసారి ఆర్టీసీ బస్సులు ఉండేవి. ప్రస్తుతం ఆ బస్సుల సమయ పాలన సరిగా లేకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ప్రయాణికులు వేచి ఉండే బస్సు షెల్టర్‌ సైతం చెత్తా చెదారానికి నిలయంగా మారింది.
- గతంలో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా స్టేషన్‌ ఆవరణను శుభ్రం చేశారు. ఆ తర్వాత పట్టించుకోకపోవడంతో ఎక్కడికక్కడ పిచ్చిమొక్కలతో ఆవరణ అధ్వానంగా మారింది. ఇప్పటికే ప్రయాణికులు పలుమార్లు రైల్వే అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. అయినా వారి నిర్లక్ష్యం కారణంగా తిప్పలు తప్పడం లేదు. పోలీసులు స్పందించి ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.



రైల్వే స్టేషన్‌లో ధ్వంసమైన ప్రహరీ





రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలో చెత్తా చెదారం, ముళ్ల పొదలు

పీజేఆర్‌ నగర్‌లో సమస్యలు పరిష్కరించండి



కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌కు సమస్యలు వివరిస్తున్న కాలనీవాసులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌ పరిధిలోని పీజేఆర్‌ నగర్‌లోని సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు సోమవారం డివిజన్‌ కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజేఆర్‌నగర్‌ కాలనీలో తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు వంటి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. కాలనీవాసులు కోరిన విధంగా వీధి దీపాలు, కొంత మేర మిగిలి ఉన్న సీసీ రోడ్లను త్వరలో నిర్మిస్తామని అన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు శివరాజ్‌గౌడ్‌, సీహెచ్‌.భాస్కర్‌, అగ్ర వాసు, మహేష్‌, బషీర్‌, ఖలీమ్‌, సుధాకర్‌, వెంకట్‌, తాయప్ప తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహిస్తాం



వాల్‌ పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న బెజగం శ్రీనివాస్‌, భోగిరెడ్డి శ్రీనివాస్‌ తదితరులు

మోతీనగర్‌: రాబోయే తరాలకు సంస్కృతి, సంప్రదాయాలు, పండుగలు, పర్వదినాల ఆవశ్యకతను తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సంస్కార భారతి తెలంగాణ ప్రాంత ప్రముఖ్‌ బెజగం శ్రీనివాస్‌ పేర్కొన్నారు. ఈ నెల 21 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే బతుకమ్మ సంబరాల వాల్‌పోస్టర్‌ను జిల్లా అధ్యక్షుడు బోగిరెడ్డి శ్రీనివాస్‌తో కలిసి ఆయన సోమవారం మోతీనగర్‌లోని ఐరా స్టూడియోలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్కార భారతి కూకట్‌పల్లి జిల్లా శాఖ అధ్యక్షుడు భోగిరెడ్డి శ్రీనివాస్‌ మాట్లాడుతూ బతుకమ్మ సంబరాలలో భాగంగా సంప్రదాయ పద్ధతులు, అలంకరణ, సంప్రదాయ గీతాల పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులతో పాటు ప్రశంస పత్రాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి డాక్టర్‌ నిర్మల విశ్వేశ్వర్‌, ప్రాంత బాధ్యులు జయలక్ష్మి, నిర్వాహకులు లావణ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ భవన్‌ నిర్మించాలని వినతి

నిజాంపేట్‌: నిజాంపేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలో దళితులు, పేద, మధ్య తరగతి ప్రజల అవసరాల నిమిత్తం అంబేడ్కర్‌ భవన్‌ నిర్మించాలని సోమవారం దళిత హక్కుల పోరాట సమితి, భారత కమ్యూనిస్ట్‌ పార్టీ ఆధ్వర్యంలో మేడ్చల్‌ మల్కాజ్‌గిరి జిల్లా ప్రజావాణిలో అడిషనల్‌ కలెక్టర్‌కు వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా దళిత హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఏసురత్నం మాట్లాడుతూ.. నిజాంపేట్‌ కార్పొరేషన్‌ పరిధిలో దాదాపు లక్షా యాభై వేల మంది ఎస్సీ ఉప కులాల ప్రజలు నివసిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ఉన్న ఎస్సీ కులాల వారికి 1975లో కాంగ్రెస్‌ ప్రభుత్వం ఎస్సైలకు ఇచ్చిన ప్రభుత్వ భూములలో ఉన్న వారికి భూభారతిలో పట్టాపాస్‌ పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. ఇందిరమ్మ ఇళ్లను దళితులందరికీ ఇవ్వాలని కోరారు. బాచుపల్లి మండలం పరిధిలో అనేక చోట్ల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతుందని, ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయించి అంబేడ్కర్‌ భవనం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో దళిత నాయకులు బక్క మల్లేష్‌, సీపీఐ మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్‌, ఆశి యాదయ్య, పొన్నికంటి దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై హింస, వేధింపుల నివారణకు సహకరించాలి

జాతీయ మహిళా కమిషన్‌ సభ్యురాలు డాక్టర్‌ అర్చన మజుందార్‌

గచ్చిబౌలి: మహిళలపై జరిగే హింసాత్మక చర్యలను వేధింపులను నివారించడానికి తమ వంతూ సహకారం అందించాలని, మహిళలకు అండగా నిలవాలని జాతీయ మహిళా కమిషన్‌ సభ్యురాలు డాక్టర్‌ అర్చన మజుందార్‌ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సైబరాబాద్‌ పోలీస్‌ కమిషనరేట్‌ కార్యాలయంలో జాతీయ మహిళా కమిషన్‌ ఆధ్వర్యంలో మహిళా జన్‌ సున్వాయ్‌ కార్యక్రమానికి గౌరవ అతిథిగా ఆమె విచ్చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... మహిళలు వివిధ రకాల సమస్యలతో సతమతమయ్యే బాధిత మహిళలకు అధికార యంత్రాంగం అండగా నిలవాలని, తగిన విధంగా తోడ్పాటు అందించాలన్నారు. మహిళలకు సంబంధించిన కేసులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పోలీసు కమిషనరేట్‌ పరిధిలో 56 పెండింగ్‌ కేసులను పరిష్కరించామన్నారు. గృహ హింస కేసులకు సబంధించిన పోలీసులు నిర్లక్ష్యం వహించవద్దన్నారు. రంగారెడ్డి, మేడ్చల్‌, హైదరాబాద్‌ జిల్లాలకు చెందిన మహిళలు 56 వినతులను ఆమెకు అందించారు. రాష్ట్ర మహిళా కమిషన్‌ చైర్‌పర్సన్‌ నేరెళ్ల శారద, డీఎస్పీలు, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి శ్రీలత, అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సేవాపక్షం కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తాం



సేవాపక్షం సన్నాహక సమావేశంలో మాధవరం కాంతారావు తదితరులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి అసెంబ్లీ పరిధిలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో కన్వీనర్‌ శ్రీకర్‌ రావు అధ్యక్షతన సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని సేవా పక్షం కార్యక్రమాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు హాజరై మాట్లాడుతూ మోదీ జన్మదినం సందర్భంగా సెప్టెంబర్‌ 17 నుంచి అక్టోబర్‌ 2 వరకు పక్షం రోజుల పాటు రాష్ట్ర పార్టీ ఇచ్చిన వివిధ సేవా కార్యక్రమాలను డివిజన్ల వారీగా ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. మొక్కలు నాటడం, స్వచ్ఛ భారత్‌, రక్తదానం, ఈనెల 21వ తేదీన నెక్లెస్‌ రోడ్డులోని అంబేడ్కర్‌ విగ్రహం నుంచి నమో యువ రన్‌ 3కే మారథాన్‌ తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చేనెల 2వ తేదీన గాంధీ జయంతి సందర్భంగా వేడుకలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవికుమార్‌, శంకర్‌రెడ్డి, మహేందర్‌, అభిషేక్‌ గౌడ్‌, హరిప్రసాద్‌, శివరంజన్‌, రమేష్‌ పాల్గొన్నారు.

జేఎన్‌టీయూహెచ్‌లో ఘనంగా ఇంజినీర్స్‌ డే



మాట్లాడుతున్న టి.కిషన్‌కుమార్‌రెడ్డి తదితరులు

బాలానగర్‌: జేఎన్‌టీయూ కాలేజ్‌ ఆఫ్‌ ఇంజినీరింగ్‌ సైన్స్‌ టెక్నాలజీ హైదరాబాద్‌, దిగ్గజ ఇంజినీర్‌ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని సోమవారం ఇంజినీర్స్‌ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్‌ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, ఉన్నతాధికారులు పాల్గొని మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా జేఎన్‌టీయూహెచ్‌ వైస్‌ చాన్స్‌లర్‌ డాక్టర్‌ టి.కిషన్‌కుమార్‌రెడ్డి హాజరై మాట్లాడారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య నుంచి ప్రేరణ పొందాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌ డాక్టర్‌ కె.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్‌, డాక్టర్‌ ఎ.రఘురాం తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్‌ డే



కూకట్‌పల్లి: వివేకానంద డిగ్రీ కళాశాల స్నాతకోత్సవం, ఫ్రెషర్స్‌ డే వేడుకలను సోమవారం అవోకా గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ విద్యా సంవత్సరం డిగ్రీ పూర్తి చేసుకొని ఉత్తీర్ణులైన విద్యార్థులకు వారి సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. నూతనంగా డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థుల కోసం ఫ్రెషర్స్‌ డే వేడుకలను నిర్వహించారు. కళాశాల చైర్మన్‌ డాక్టర్‌ కొరదాల నరేష్‌, డైరెక్టర్‌ కేవీ లావణ్య, డీన్‌ మౌనిక, ప్రిన్సిపాల్‌ బీఎస్‌.రాజేష్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌ డా.శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

మధ్య ఆసియాతో సంబంధాలు విడదీయలేనివి

'మనూ' వీసీ ప్రొఫెసర్‌ సయ్యద్‌ ఐనుల్‌ హసన్‌

రాయదుర్గం: ఇస్లామిక్‌ ప్రపంచంలోని మధ్య ఆసియా భాగంతో భారతదేశానికి ఉన్న సాంస్కృతిక సంబంధాలు విడదీయలేనవని మౌలానా ఆజాద్‌ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్‌ ప్రొఫెసర్‌ సయ్యద్‌ ఐనుల్‌ హసన్‌ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో కోల్‌కతాలోని సొసైటీ ఫర్‌ ది హిస్టరీ ఆఫ్‌ సైన్స్‌ సహకారంతో చరిత్ర విభాగం, హెచ్‌కే షేర్వానీ సెంటర్‌ ఫర్‌ డెక్కన్‌ స్టడీస్‌, ఇండియన్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ సోషల్‌ సైన్స్‌ రీసెర్చ్‌ సహకారంతో 'సైన్స్‌ ఇన్‌ ది దక్కన్‌: ఏ హిస్టారికల్‌ అండ్‌ కాంటెంపరరీ పర్స్పెక్టివ్‌' అనే జాతీయ సెమినార్‌లో ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ముస్లిమ్‌ ప్రపంచం గొప్ప శాస్త్రీయ వారసత్వాన్ని, సమకాలీన పరిశోధనలకు దాని ఔచిత్యాన్ని నొక్కి చెప్పారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్‌చైర్మన్‌ ప్రొఫెసర్‌ ఎస్‌.కె.మహమూద్‌ మాట్లాడుతూ.. శాస్త్ర చరిత్ర, చరిత్ర అధ్యయనం ప్రాముఖ్యతను వివరించారు. ఇంజినీరింగ్‌ అండ్‌ టెక్నాలజీ చరిత్రకు ఎస్‌పి బెనర్జీ స్మారక బహుమతి, వైద్య చరిత్రకు పార్థా ప్రోతిమ్‌ బందోపాధ్యాయ స్మారక బహుమతిని ప్రొఫెసర్‌ సయ్యద్‌ ఐనుల్‌ హసన్‌ అందించారు. ప్రొఫెసర్‌ దీపక్‌కుమార్‌, ప్రొఫెసర్‌ అట్లూరి మురళి, చరిత్ర విభాగం కన్వీనర్‌, అధిపతి ప్రొఫెసర్‌ రఫియుల్లా అజ్మీ, హెచ్‌కే షేర్వాని సెంటర్‌ ఫర్‌ డెక్కన్‌ స్టడీస్‌ కన్వీనర్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ సల్మా అహ్మద్‌ ఫారూఖీ, ప్రసంగించారు.

కాంగ్రెస్‌ పార్టీలోకి చేరికలు

నిజాంపేట్‌: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు కాంగ్రెస్‌ పార్టీలోకి చేరారు. 125 డివిజన్‌ దేవేందర్‌ నగర్‌ డబుల్‌ బెడ్‌రూమ్‌ బీఆర్‌ఎస్‌ నాయకులు జగన్‌నాథ్‌, పి.శ్రీనివాస్‌, ఏ.సత్యనారాయణ, ఎస్‌.ప్రసాద్‌, నాగరాజు, విజయ్‌, డి.ఆనంద్‌ తదితరులు కుత్బుల్లాపూర్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి కొలన్‌ హన్మంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

'సర్క్యులర్‌ ఎకానమీ సెల్‌' ప్రారంభం

రాయదుర్గం: ప్రకృతి సంపదను విధ్వంసం చేయకుండా ఇంజనీరింగ్‌ పనులు నిర్వహించినప్పుడే పర్యావరణాన్ని సంరక్షించిన వారమవుతామని కాలిగొట్ల టెక్నాలజీస్‌ లిమిటెడ్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ కాలిగొట్ల వెంకట మురళి అన్నారు. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్‌ స్టాఫ్‌ కాలేజ్‌ ఆఫ్‌ ఇండియాలో ఇంజనీర్స్‌ డే సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన 'సర్క్యులర్‌ ఎకానమీ సెల్‌'ను ఆయన సోమవారం ప్రారంభించారు. ఎస్కీ డైరెక్టర్‌ డాక్టర్‌ రామేశ్వరరావు మాట్లాడుతూ... తొలితరం ఇంజనీర్‌ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అతి పేద కుటుంబం నుంచి వచ్చారని ప్రపంచమే ఆశ్చర్యపడే సాగునీటి ప్రాజెక్టులు, వందేళ్ల కిందటే కట్టడాన్ని చూసి, వారి ఇంజనీరింగ్‌ ప్రతిభకు మెచ్చి బ్రిటిష్‌ ప్రభుత్వం అతన్ని గౌరవిస్తూ 'సర్‌' అనే గొప్ప బిరుదును ప్రసాదిస్తే, భారత ప్రభుత్వం అత్యున్నతమైన పౌర సత్కారం 'భారతరత్న' బిరుదుతో ఆయనను గౌరవించిందని గుర్తు చేశారు. చీఫ్‌ ప్రాజెక్టు ఇంజనీర్‌ డి శ్రీధర్‌బాబు, పవర్‌ అండ్‌ ఎనర్జీ హెడ్‌ ఉబ్బ విద్యాసాగర్‌, ప్రొఫెసర్‌ వెంకట్‌రెడ్డి, కాలేజ్‌ చీఫ్‌ లక్ష్మీకాంతరావు, డిప్యూటీ చీఫ్‌ డాక్టర్‌ పి.రాజారావు, డాక్టర్‌ చంద్రకళ, వెంకట్‌రెడ్డి జ్యోతి, విద్యాసాగర్‌, అశోక్‌, ఎం.వి.ఎస్‌.సాగర్‌, సాయి కిశోర్‌, భరత్‌, అనితా అగర్వాల్‌, రాజేశ్వరి, నరేష్‌, సౌమ్య, జ్యోతి ఆది సురేష్‌ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం



ఆర్‌ఆర్‌నగర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఓల్డ్‌ బోయిన్‌పల్లి: ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఓల్డ్‌ బోయిన్‌పల్లి డివిజన్‌ ఆర్‌ఆర్‌నగర్‌లో రూ.48 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను సోమవారం స్థానిక కార్పొరేటర్‌ ముద్దం నర్సింహయాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అభిమానంతో మూడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించానని, వారి సంక్షేమం, అభివృద్ధే తన లక్ష్యమని అన్నారు. ఓల్డ్‌ బోయిన్‌పల్లి డివిజన్‌లో ఎన్నో సమస్యలను అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌, మంత్రి కేటీఆర్‌ సహకారంతో పరిష్కరించి, ప్రస్తుతం సమస్యలు లేని ప్రాంతంగా తీర్చిదిద్దినట్లు గుర్తు చేశారు. రోడ్డు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యం, శ్మశానవాటికల అభివృద్ధి, కమ్యూనిటీ హాల్స్‌, పార్కులు, ఓపెన్‌ జిమ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో బ్రిడ్జిలు, చెరువుల సుందరీకరణ వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేశామని చెప్పారు. కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని సుందరంగా, సమస్యలు లేకుండా చేయాలనే ఆకాంక్షకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని అన్నారు. కాలనీవాసులు శ్రీనివాసరావు, చక్రపాణి, మీనాక్షి పవర్‌, త్యాగరాజ్‌, సత్యనారాయణ, మనోజ్‌ పటేల్‌, సునీత, గణేష్‌ జీహెచ్‌ఎంసీ ఈఈ గోవర్ధన్‌గౌడ్‌, డీఈ నిఖిల్‌రెడ్డి, ఏఈ ఆశా, వాటర్‌వర్క్స్‌ మేనేజర్‌ యాదగిరి, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ శ్రీకాంత్‌, రాజేష్‌, రాజు, సంపత్‌ నాయకులు ఇర్ఫాన్‌, మేకల హరినాథ్‌, కర్రె జంగయ్య, బుర్రి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

మోతీనగర్‌: అధికారంలో ఉన్నా లేకున్నా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. మూసాపేట డివిజన్‌లోని పలు అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్‌ మహేందర్‌, మాజీ కార్పొరేటర్‌ తూము శ్రావణ్‌కుమార్‌తో కలిసి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేసేవరకు ఆందోళనలు చేస్తామని అన్నారు.

రక్తదాతలు.. ప్రాణదాతలు

వైద్య శిబిరాలతో ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. దివంగత తెలంగాణ ఉద్యమ నేత మన్నె గణేష్‌యాదవ్‌ జ్ఞాపకార్థం బోయిన్‌పల్లి వ్యవసాయ కూరగాయల మార్కెట్‌ మాజీ వైస్‌ చైర్మన్‌ మన్నె ఉదయ్‌యాదవ్‌, మన్నె శివశంకర్‌ యాదవ్‌ సోమవారం మల్లికార్జుననగర్‌లోని భాగ్యశ్రీ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన, వైద్య శిబిరాన్ని కార్పొరేటర్‌ ముద్దం నర్సింహయాదవ్‌, ఎస్సీ కార్పొరేషన్‌ మాజీ చైర్మన్‌ ఎర్రోళ్ల శ్రీనివాస్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మన్నె గణేష్‌యాదవ్‌ చిత్రపటానికి నివాళులర్పించారు. పేద, మధ్య తరగతి ప్రజలతో పాటు ప్రతి ఒక్కరికీ ఆరోగ్యంపై సూచనలు, సలహాలు అందించి వారికి అవగాహన కల్పించాలని డాక్టర్లను కోరారు.